క్లుప్తంగా

16న మండల సర్వసభ్య సమావేశం

వీరఘట్టం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 16న సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బి.వెంకటరమణ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ వెంకటరమణనాయుడు అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు విధిగా హాజరుకావాలని కోరారు.

పరామర్శ



మృతుడి కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే కళావతి

సీతంపేట: ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన గడబవలస గ్రామానికి చెందిన చిలకల శేఖర్ కుటుంబాన్ని పాలకొండ మాజీ ఎమ్మెల్యే విశ్వాసరాయి కళావతి గురువారం పరామర్శించారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని ఓదార్చారు.

వ్యాధుల పట్ల అప్రమత్తం

గరుగుబిల్లి: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గరుగుబిల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్ఎంకే తిరుమల ప్రసాద్ అన్నారు. గురువారం ఆయన స్థానిక పీహెచ్‌సీలో పలువురు రోగులకు తనిఖీలు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జ్వరం, తలనొప్పి, కళ్లనొప్పి, తదితర సమస్యలతో బాధపడుతున్న వారు సొంత వైద్యం చేసుకోకుండా పీహెచ్‌సీలో సంప్రదించాలన్నారు. అలాగే ప్రతి ఒక్కరూ వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటించాలని సూచించారు. ముఖ్యంగా దోమలు వ్యాప్తి చెందకుండా చర్యలు తీసుకోవాలన్నారు.

భక్తిశ్రద్ధలతో జై గురుదత్త హోమం



హోమంలో పాల్గొన్న భక్తులు

గరుగుబిల్లి: మండల కేంద్రంలోని షిర్డీ సాయిబాబా మందిరంలో జై గురుదత్త హోమం గురువారం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ప్రముఖ యజ్ఞకర్త ఎస్‌వీఎల్ఎన్ శర్మయాజీ ఆధ్వర్యంలో చేపట్టిన హోమంలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. అనంతరం అన్నదానం నిర్వహించారు.

రాజీయే రాజమార్గం



పోలీస్ సిబ్బందితో లోక్‌అదాలత్‌పై చర్చిస్తున్న న్యాయమూర్తి హరిప్రియ

పాలకొండ రూరల్: రాజీయే రాజమార్గమని స్థానిక జూనియర్ సివిల్ కోర్టు న్యాయమూర్తి చందక హరిప్రియ అన్నారు. ఈనెల 13న నిర్వహించనున్న జాతీయ లోక్‌అదాలత్ కార్యక్రమాన్ని కక్షిదారులు సద్వినియోగపర్చుకునేలా చైతన్యపరచాలని న్యాయవాదులు, పోలీస్ అధికారులకు సూచించారు. గురువారం స్థానిక న్యాయస్థానం ప్రాంగణంలో నిర్వహించిన సదస్సులో ఆమె మాట్లాడుతూ.. కక్షిదారులకు లోక్‌అదాలత్ ఆవశ్యకతను వివరించాలన్నారు. అనంతరం రాజీ అవదగ్గ కేసులపై ఆరా తీశారు.

సత్కారం..



ప్రిన్సిపాల్ లక్ష్మణరావును సత్కరిస్తున్న డీఈఓ, తదితరులు

కొమరాడ: మండలంలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలుర ఆశ్రమ పాఠశాల పిన్సిపాల్ డి.లక్ష్మణరావు ఇటీవల రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు అందుకున్నారు. ఈ నేపథ్యంలో ఆయన్ను పాఠశాల ఆవరణలో డీఈఓ బి.రాజ్‌కుమార్, తదితరులు గురువారం సత్కరించారు. అనంతరం విద్యార్థుల భోజనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో మండల విద్యాశాఖాధికారి నారాయణస్వామి, సహచర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వృద్ధుడి అదృశ్యంపై ఫిర్యాదు

గుమ్మలక్ష్మీపురం: మండలంలోని జర్న గ్రామానికి చెందిన వాటక భాగల అనే గిరిజనుడు 52 రోజుల నుంచి కనిపించడం లేదని కుటుంబీకులు ఎల్విన్‌పేట పోలీస్‌స్టేషన్‌లో గురువారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఎస్సై బి.శివప్రసాద్ మాట్లాడుతూ..వృద్ధుడు మూగ, చెవిటి వాడని.. జూలై 21న గ్రామానికి దగ్గర్లో ఉన్న కొమరాడ మండలం కూనేరు సంతకు వెళ్లి తిరిగి ఇంటికి చేరుకోలేదన్నారు. సమీప గ్రామాల్లో వెతికినా ఫలితం లేకపోవడంతో కుటుంబ సభ్యులు ఫిర్యాదు చేశారని చెప్పారు. తప్పిపోయిన వ్యక్తి ఎవరికి కనిపించినా 94919 06485, 79812 96171 నంబర్లకు సమాచారం తెలియజేయాలని కోరారు.

అస్తవ్యస్తంగా పీఏసీఎస్‌లు



వీరఘట్టం వ్యవసాయ ప్రాథమిక సహకార పరపతి సంఘం కార్యాలయం

- పాలకొండ నియోజకవర్గంలో జరగని త్రీమెన్ కమిటీ నియామకాలు
- పాలక మండళ్లు లేక గాడి తప్పుతున్న పాలన
- ఖరీఫ్‌లో రైతులకు అందని సహకార సంఘాల సేవలు

వీరఘట్టం: ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో త్రీమెన్ కమిటీ నియామకాలు ఇష్టారాజ్యంగా జరుగుతున్నాయి. దీంతో రైతులకు సరైన సేవలు అందడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. రాష్ట్రంలో గతేడాది అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘాల్లో (పీఏసీఎస్) అప్పటి వరకున్న త్రీమెన్ కమిటీలను రద్దు చేసింది. తర్వాత వారి అనుచరులతో కూడిన కమిటీలను ఏర్పాటు చేసుకుంది. ఇందులో భాగంగా ఆరు నెలల కిందట పార్వతీపురం మన్యం జిల్లాలోని సాలూరు, పార్వతీపురం, కురుపాం నియోజకవర్గాల్లోని పీఏసీఎస్‌ల్లో మాత్రం త్రీమెన్ కమిటీలను నియమించారు. ఒక్క పాలకొండ నియోజకవర్గంలో ఉన్న 8 సొసైటీలలో ఇంత వరకు కమిటీలను వేయకపోవడంతో పాలన గాడి తప్పుతోంది. పాలకొండ నియోజకవర్గంలో ఏడాదిగా ప్రత్యేకాధికారుల పాలనతో సహకార సంఘాలు నడుస్తుండం.. పీఏసీఎస్‌ల్లో పాలక మండళ్లు లేకపోవడంతో రైతులకు వ్యవసాయ రుణాలు, ఎరువులు, విత్తనాలు వంటివి అందకపోవడంపై రైతులు మండిపడుతున్నారు. జిల్లా అంతటా త్రీమెన్ కమిటీల నియామకం పూర్తయినా, ఒక్క పాలకొండ నియోజకవర్గంలో ఇంకా వేయకపోవడం ప్రస్తుతం చర్చనీయాంశమైంది. ఇదిలా ఉంటే . పీఏసీఎస్‌ల్లో నామినేటెడ్ పదవుల కోసం ఆశిస్తున్న వారు ఆ పదవుల కోసం ఆశగా ఎదురు చూస్తున్నారు.

రైతులకు అందని ఎరువులు...

వీరఘట్టంలో ఉన్న పీఏసీఎస్‌కు ఈ ఏడాది ఒక లారీ లోడ్ యూరియా వచ్చింది. ఈ లారీని ఓ టీడీపీ నేత తరలించుకుపోవడంతో మిగిలిన రైతులకు యూరియా అందలేదు. దౌర్జన్యంగా ఆ లారీ యూరియాను తరలించుకుపోవడంతో తర్వాత సొసైటీ అధికారులు యూరియా తెప్పించేందుకు వెనుకడుగు వేశారు. గతంలో పీఏసీఎస్‌ల ద్వారా రైతులకు కావాల్సిన ఎరువులు, విత్తనాలు అందేవి.

సొసైటీ ఉన్నా ఉపయోగం సున్నా..



వీరఘట్టంలో సొసైటీ ఉన్నా దాని వల్ల రైతులకు ఎటువంటి ఉపయోగం లేదు. కనీసం ఒక యూరియా బస్తా కూడా సామాన్య రైతులకు అందడం లేదు. ఈ సీజన్‌లో ఒక్క లారీ లోడు యూరియా వస్తే టీడీపీ నాయకులు పంచుకున్నారు. సామాన్య రైతులకు ఎవ్వరికీ యూరియా ఇవ్వలేదు. మరి అలాంటప్పుడు ఈ సొసైటీ వల్ల ఏం ఉపయోగం.

– శిర్లాపు జగన్, రైతు, వీరఘట్టం

పలుకుబడి ఉన్నోళ్లకే ఉపయోగం..



సొసైటీల్లో పలుకుబడి ఉన్న వారికే ఎరువులు ఇస్తున్నారు. సామాన్య రైతులకు ఎరువులు అందని ద్రాక్షే. యూరియా కోసం రైతులు ఇంత ఇబ్బంది పడుతుంటే సొసైటీ వాళ్లు కనీసం పట్టించుకోవడం లేదు. రైతులు పడుతున్న ఇబ్బందులు చూస్తున్నారే తప్ప రైతులకు యూరియా తెచ్చి ఇవ్వడం లేదు. రైతులకు ఉపయోగం లేని ఈ సొసైటీలను మూసివేయాలి.

– పిన్నింటి శ్రీనివాసరావు, వైఎస్సార్‌సీపీ ఉపాధ్యక్షుడు, వీరఘట్టం

ఇప్పుడు పాలకమండళ్లు లేకపోవడంతో ప్రస్తుతం ఉన్న ప్రత్యేకాధికారులు యూరియా తీసుకువచ్చేందుకు వెనుకంజ వేస్తున్నారు. అటు ఆర్‌ఎస్‌కేలకు యూరియా రాకపోవడం, సొసైటీలకు యూరియా తెచ్చే అవకాశం ఉన్నా ప్రత్యేకాధికారులు పట్టించుకోకపోవడంతో ఈ ఏడాది పాలకొండ నియోజకవర్గంలో పీఏసీఎస్‌లు దిష్టిబొమ్మల్లా మిగిలాయి. ఇప్పటికైనా ప్రజాప్రతినిధులు పాలక మండళ్లను నియమించి సొసైటీ సేవలను రైతులకు అందుబాటులోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

మౌలిక సదుపాయాలు కల్పించాలి



పెదశాఖ సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ ఎస్.రమేష్

కొమరాడ: కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకువచ్చిన ఆదికర్మయోగి అభియాన్ కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో సభలు నిర్వహించి సమస్యలు గుర్తించడంతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎంపీడీఓ ఎస్ .రమేష్ అన్నారు. మండలంలోని పెదశాఖ పంచాయతీ చినశాఖ, దర్సింగి, జల, గుజ్జబడి, తదితర గ్రామల్లో గ్రామసభలు నిర్వహించి ర్యాలీలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ..రోడ్లు, డ్రెయిన్లు, శ్మశానవాటికలు, ఇళ్ల నిర్మాణాలు, పింఛన్ల మంజూరు, తదితర అంశాలపై దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ ఎంపీడీఓ రాధాకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

పాలకొండలో వర్షం



పాలకొండ - రాజుపేట రహదారిపై చేరిన వర్షపు నీరు

పాలకొండ రూరల్: బంగాళాఖాతంలో కొనసాగుతున్న ఉపరితల ఆవర్తన ప్రభావంతో గురువారం మండల వ్యాప్తంగా వర్షం కురిసింది. ఈ ప్రభావంతో సాగునీటి వనరుల్లో జలకళ సంతరించుకుంది. వీరఘట్టం రహదారిలో లోతట్టు వరిపంట భూముల్లోకి వర్షపు చేరింది. దీంతో తమ పంటలు పోయే అవకాశం ఉందని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇదిలా ఉంటే తాజా వర్షం దాటికి కోమటిపేట, కస్పావీధి, గారమ్మ కాలనీ, కాపువీధుల్లో డ్రైనేజీ వ్యవస్థ అస్తవ్యస్తం కావడంతో నీరు రోడ్ల మీదుగా పారుతోంది.

చట్టాలపై అవగాహన తప్పనిసరి



అవగాహన కల్పిస్తున్న పోలీస్ సిబ్బంది

పాలకొండ రూరల్: మానవ రక్షణకు నిర్దేశింపబడిన చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని శక్తి టీమ్ ఏఎస్సై ఝాన్సీ అన్నారు. మండల పరిధిలోని పలు పాఠశాలలు, కళాశాలల్లో గురువారం అవగాహన సదస్సులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాదకద్రవ్యాల వినియోగం, రవాణా.. సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. అలాగే గుడ్, బ్యాడ్ టచ్‌పై వివరించారు.

డిమాండ్ల సాధనకు గళమెత్తిన ఉపాధ్యాయులు



వీరఘట్టం: నడిమికెల్ల జిల్లా పరిషత్ హైస్కూల్ వద్ద నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలియజేస్తున్న ఉపాధ్యాయులు

వీరఘట్టం: తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ ఉపాధ్యాయులు గళమెత్తారు. ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలు ధరించి గురువారం విధులకు హాజరై నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ మండల శాఖ ప్రెసిడెంట్ ఎం. మురళి మాట్లాడుతూ.. ఉపాధ్యాయులకు పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను వెంటనే ప్రకటించాలని డిమాండ్ చేశారు. అలాగే సీపీఎస్ రద్దు చేయడంతో పాటు 12వ పీఆర్‌సీ ఏర్పాటు, ఐఆర్ ప్రకటనపై స్పష్టత ఇవ్వాలని కోరారు. ఈహెచ్‌ఎస్ బకాయిలను రూ.25 లక్షలకు పెంచాలని కోరారు. బోధనేతర పనులను రద్దు చేయాలన్నారు. కార్యక్రమంలో బి. రామారావు, తదితరులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల నిరసన ..

పాలకొండ: ఉపాధ్యాయులు నిరసన బాట పట్టారు. తొలిరోజు నల్లబ్యాడ్జీలతో మొదటి రోజు విధులకు హాజరయ్యారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరారు. పీఆర్‌సీ ప్రకటించాలని డిమాండ్‌చేశారు. మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు.

సమస్యల పరిష్కారమే లక్ష్యం..

కురుపాం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఉపాధ్యాయులు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకుల జగదీశ్వరరావు, మజ్జి ఉపేంద్ర మాట్లాడుతూ.. పెండింగ్‌లో ఉన్న నాలుగు డీఏలను తక్షణం విడుదల చేయాలని, సీపీఎస్ రద్దు చేయాలని, మెమో 57ను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. నిరసన కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు తోట శంకరరావు, భమిడిపాటి మూర్తి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మహిళల రక్షణకు శక్తి యాప్



శక్తి యాప్‌పై అవగాహన కల్పిస్తున్న ఏఎస్సై శ్రీనివాసరావు

గరుగుబిల్లి: మహిళల రక్షణ, భద్రత కోసమే ఏర్పాటు చేసిన శక్తి యాప్‌ను అత్యవసర సమయాలలో వినియోగించుకోవాలని ఏఎస్సై ఎల్.శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని తోటపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు శక్తి టీమ్ లక్ష్యాలు, యాప్ వినియోగంపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లైంగిక వేధింపులు, ట్రాఫిక్ ఇబ్బందులు, ఈవ్ టీజింగ్, తదితర సమస్యలు ఎదురైనప్పుడు హెల్ప్‌లైన్ 100,112 నంబర్లకు తెలియజేయాలన్నారు. అలాగే వాట్సాప్ నంబర్ 79934 85111 నంబర్ కూడా తెలియజేయవచ్చని చెప్పారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులతో పాటు మహిళా పోలీస్ నిర్మల పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

కొమరాడ: మండల కేంద్రానికి చెందిన గుత్తావల్లి సురేష్ కుమార్తె జి. చిన్నారి ఇటీవల అకస్మాత్తుగా మృతి చెందింది. విషయం తెలుసుకున్న మజ్జిగౌరి ఆటో యూనియన్ నాయకులు గోపి, శ్రీను, తదితరులు రూ. ఐదు వేలు పోగుచేసి చిన్నారి తల్లిదండ్రులకు గురువారం అందజేశారు. ఆపదలో ఉన్న తోటి డ్రైవర్‌ను ఆదుకోవాలనే ఉద్దేశంతోనే ఆర్థిక సాయం చేసినట్లు యూనియన్ నాయకులు తెలిపారు.

జిల్లేడు ద్రావణం తయారీపై అవగాహన

గరుగుబిల్లి: ప్రకృతి వ్యవసాయ విధానంలో భాగంగా క్రిమికీటకాల నియంత్రణకు అవసరమైన ద్రావణాల తయారీపై ప్రకృతి వ్యవసాయ సీఆర్‌పీలు అవహన కల్పిస్తున్నారు. ఇందులో భాగంగా మండలంలోని ఉల్లిబద్ర గ్రామంలో జిల్లేడు ఆకులతో ద్రావణం తయారీపై గురువారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఏ శ్రీనివాసరావు మాట్లాడుతూ.. జిల్లేడు ద్రావణం సహజ కీటక నాశినిగా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో రైతులతో పాటు ఐసీఆర్‌పీ బి.ఇందిర, తదితరులు పాల్గొన్నారు.

అభినందనలు



డివిజన్ స్థాయి పోటీలకు ఎంపికైన క్రీడాకారులతో హెచ్‌ఎం, ఉపాధ్యాయులు

పాలకొండ రూరల్: మండంలోని చిన మంగళాపురం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు క్రీడాపోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచారని పాఠశాల హెచ్‌ఎం జామి రవి అన్నారు. ఈ మేరకు క్రీడాకారులను పాఠశాల ఆవరణలో గురువారం అభినందించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం రవి మాట్లాడుతూ..పాలకొండ ప్రభుత్వ ఉన్న పాఠశాల క్రీడా ప్రాంగణంలో ఇటీవల జరిగిన మండల స్థాయి అండర్-14 క్రీడాపోటీల్లో తమ పాఠశాలకు చెందిన 22 మంది క్రీడాకారులు కబడ్డీ, యోగా, బ్యాడ్మింటన్, లాంగ్‌జంప్, రన్నింగ్, తదితర క్రీడల్లో పాల్గొని ప్రతిభ కనబరిచారని చెప్పారు. పీఈటీ జడ్డు హైమావతి తర్ఫీదులో తమ క్రీడాకారులు మండల స్థాయి నుంచి డివిజన్ స్థాయికి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ నెల 15న జరగనున్న పోటీల్లో పాల్గొని సత్తా చాటాలని ఆకాంక్షిచారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

సందర్శన



మాట్లాడుతున్న పీఓ పవార్ స్వప్నిల్ జగన్నాథ్

సీతంపేట: ఐటీడీఏ పీఓ పవార్ స్వప్నిల్ జగన్నాథ్ మండలంలోని సోమగండి గ్రామాన్ని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ.. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎరువులు పూర్తిస్థాయిలో సరఫరా చేయాలని రైతులు కోరగా.. వ్యవసాయశాఖ ద్వారా ఇప్పటికే చాలా మంది రైతులకు ఎరువులు పంపిణీ చేశామని, మిగిలిన వారికి కూడా త్వరలోనే పంపిణీ చేస్తామని పీఓ బదులిచ్చారు. అనంతరం స్థానిక సబ్‌సెంటర్, పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో ఏపీఓ చిన్నబాబు, తహసీల్దార్ శ్రీకన్య, వ్యవసాయాధికారి వాహిని, తదితరులు పాల్గొన్నారు.

డీఈఓ సుడిగాలి పర్యటన



కోటిపాం పాఠశాలలో విద్యార్థుల సామర్థ్యాలను అంచనా వేస్తున్న డీఈఓ రాజ్‌కుమార్, తదితరులు

కొమరాడ: మండలంలోని కొమరాడ, కోటిపాం జిల్లా పరిషత్ పాఠశాలలతో పాటు కేజీబీవీ, గుమడ మండల పరిషత్ పాఠశాలలను డీఈఓ బి. రాజ్‌కుమార్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో అమలవుతున్న మధ్యాహ్న భోజనాలను పరిశీలించారు. భోజనం నాణ్యతపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. అలాగే విద్యార్థుల విద్యాసామర్థ్యాలపై ఆరా తీశారు. ఆయన వెంట మండల విద్యాశాఖాధికారి జామి నారాయణ స్వామి, తదిదతరులు పాల్గొన్నారు.

అన్నదాతల ఆందోళన..



మార్కెట్ యార్డ్ వద్ద ఆందోళన చేస్తున్న రైతులు

వీరఘట్టం: స్థానిక మార్కెట్ యార్డు వద్ద యూరియా కోసం రైతులు గురువారం ఆందోళన చేపట్టారు. సచివాలయం-1 పరిధిలో ఉన్న వారికి మాత్రమే 400 బస్తాల యూరియా ఇచ్చేస్తే మిగిలిన రైతుల పరిస్థితి ఏమిటని పలువురు రైతులు ప్రశ్నించారు. ఇటీవల అధికారులు వీధుల్లోకి వచ్చి యూరియా స్లిప్పులు ఇచ్చారని, ఆ సమయంలో లేని రైతులకు స్లిప్పులు అందలేదన్నారు. ఈ విషయమై ఏఓ జె. సౌజన్య వద్ద ప్రస్తావించగా.. కూరగాయల రైతుల కోసం ఉద్యానవన శాఖ ఆధ్వర్యంలో యూరియా వచ్చిందని తెలిపారు. యూరియా అందలేని వారికి రెండు రోజుల్లో అందిస్తామని చెప్పారు.

13,14 తేదీల్లో జనవిజ్ఞాన వేదిక మహాసభలు



మాట్లాడుతున్న జనవిజ్ఞాన వేదిక జిల్లా ఉపాధ్యక్షుడు గౌరునాయుడు

వీరఘట్టం: ఈ నెల 13,14 తేదీల్లో జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర మహాసభలను విజయనగరంలో నిర్వహించనున్నట్లు వేదిక పార్వతీపురం మన్యం జిల్లా ఉపాధ్యక్షుడు కొండపల్లి గౌరునాయుడు తెలిపారు. గురువారం ఆయన మండల కేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ.. విజయనగరం జిల్లా పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో జరగనున్న ఈ కార్యక్రమానికి రాజకీయ విశ్లేషకుడు, ప్రొఫెసర్ నాగేశ్వరరావు హాజరవుతున్నారని తెలిపారు. అలాగే సైంటిస్టులు, మాజీ ఎమ్మెల్సీలు, విద్యావేత్తలు హాజరవుతున్నందున ఆసక్తి గల వారంతా సమావేశాల్లో పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. ఆయనతో పాటు జనవిజ్ఞాన వేదిక సభ్యులు ఆర్.ధనుంజయ నాయుడు, అలజంగి చిన్నారావు, బోనంగి దుర్గాప్రసాద్, యందవ రాజు, తదితరులు పాల్గొన్నారు.

పశువైద్య సేవలను సద్వినియోగం చేసుకోండి

- మండల పశువైద్యాధికారి శైలజ



పశువును తనిఖీ చేస్తున్న పశువైద్యాధికారి శైలజ

కురుపాం: గ్రామాల్లో అందిస్తున్న పశువైద్య సేవలను పాడి రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారి శైలజ సూచించారు. మండలంలోని జి. శివడ, కొత్తగూడ, మధురవాడ గిరిజన గ్రామాల్లో గురువారం వైద్యశిబిరాలు నిర్వహించి, పశువులకు వైద్య పరీక్షలు చేపట్టారు. అలాగే లింగనిర్ధారిత ఇంజిక్షన్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో లైవ్‌స్టాక్ అసిస్టెంట్ గుంట ముక్కల అఖిలేష్, పశువైద్య సహాయకులు గంగారావు, పార్వతి, రైతులు పాల్గొన్నారు .

సారా రవాణాను అరికట్టాలి

- ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ శాఖ అసిస్టెంట్ కమిషనర్ రామచంద్రరావు



సిబ్బందితో మాట్లాడుతున్న అసిస్టెంట్ కమిషనర్ పి.రామచంద్రరావు

కురుపాం: సారా అక్రమ రవాణాకు అడ్డుకట్ట వేయాల్సిందేనని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్‌శాఖ అసిస్టెంట్ కమిషనర్ పి.రామచంద్రరావు ఆదేశించారు. గురువారం స్థానిక ఎక్సైజ్ సర్కిల్ స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కురుపాం ఎక్సైజ్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ఎస్సై జె.రాజశేఖర్, సిబ్బందితో సమావేశమై సారా కేసుల వివరాలు, తయారీ కేంద్రాలపై అడిగి తెలుసుకున్నారు. ఎక్కువగా సారా కేసులు నమోదైన వ్యక్తులపై పీడీ యాక్ట్ ప్రయోగించాలని.. ఆంధ్రా – ఒడిశా సరిహద్దుల్లో రాత్రిపూట పహారా కాసి సారా రవాణాపై దృష్టి సారించాలన్నారు.

బాధ్యులపై చర్యలు తీసుకోవాలి



సబ్‌కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న బాధిత గిరిజనులు

పాలకొండ రూరల్: తమ భూముల్లో దౌర్జన్యంగా చొరబడి పంటలు నాశనం చేస్తున్నవారిపై చట్టపరమైన చర్యలు చేపట్టాలని జియ్యమ్మవలస మండలం గడిసింగుపురం పంచాయతీ పరిధిలోని బాధితులు డిమాండ్ చేశారు. ఈ మేరకు గురువారం స్థానిక సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా బాధితులు మాట్లాడుతూ.. గడసింగుపురం, ఏనుగులగూడలకు చెందిన గిరిజనులు 15 ఏళ్లుగా ఆ ప్రాంతాల్లోని 40 ఎకరాల్లో సేద్యం చేస్తున్నారన్నారు. ఈ మొత్తం భూమిలో 30 ఎకరాలకు డీ పట్టా అందించినట్లు తెలిపారు. ఇటీవల కాలంలో సంతనర్సిపురం గ్రామానికి చెందిన కె.పార్వతమ్మ, కె.జయలలిత, చిన్నమ్మలు, జి.గౌరమ్మ, వి.రాములు, జి.జగన్నాథం, అలివేలుతో పాటు మరి కొంతమంది తమపై దౌర్జన్యం చేస్తున్నారని వాపోయారు. ఈ విషయాన్ని గతంలో పలుమార్లు స్థానిక మండల అధికారులకు విన్నవించినా ఫలితం లేకపోయిందన్నారు. జీడి, పత్తి మొక్కలను ఈ నెల 9న పూర్తిగా ధ్వంసం చేసినట్లు అధికారులకు వివరించారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

అన్నదానం

వీరఘట్టం: స్థానిక ముచ్చర్లవీధిలో వినాయక నవరాత్రి ఉత్సవాలు ముగియడంతో గురువారం ఉత్సవకమిటీ సభ్యులు అన్నసంతర్పణ కార్యక్రమం చేపట్టారు. భక్తులు పెద్ద ఎత్తున పాల్గొని స్వామి ప్రసాదం స్వీకరించారు. కార్యక్రమంలో కమిటీ సభ్యులు, వీధి పెద్దలు పాల్గొన్నారు.